# దుర్గతి

"ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్" అని ఫోన్ మోగింది. "హల్లో!" అన్నాడు అంబుజోదరం. "నేనండి! శ్రీవిద్యని" అంది అవతలి గొంతు. అంబుజోదరానికి శ్రీవిద్య ఎవరో తెలియదు. ఆ గొంతుక ఎప్పుడూ వినలేదు కూడాను. "మీరెవరో దయచేసి చెప్పండి. నాకు తెలీదు" అన్నాడు.

"మీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి రిటైరై రెణ్నెల్ల కిందట కాలం చేసిన వనమాలిగారి భార్యనండీ!" అవతలి గొంతు. "ఆ సరే గుర్తొచ్చింది. ఏమిటో చెప్పండి" అన్నాడు అంబుజోదరం.

"మావారి పించన్ కొంత నా కొస్తుంది కదండీ! ఆ పించన్ ఫారాలు కాస్త నింపి పెడతారేమోనని" అందావిడ.

"ఓ తప్పకుండా" అన్నాడు అంబుజోదరం. "ఎప్పుడు రమ్మంటారు?" అందావిడ.

"వచ్చేముందు కొన్ని డాక్యుమెంట్లు పట్టుకురావాలి. మీవారి డెత్ సర్టిఫికెట్. ఎమ్మార్వో ఇచ్చే లీగల్ హెయిర్ సర్టిఫికెట్. మీ పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు నాలుగు, అవైనా రీసెంట్‌గా తీయించినవి పాతవి పనికిరావు."

"అన్నీ రెడీగా ఉన్నాయి. మీరెప్పుడు రమ్మంటారో చేప్తే అవన్నీ పట్టుకునే వస్తాను" అందావిడ.

"ఎల్లుండి పొద్దున్న పదిగంటలకు రండి" అన్నాడు.

"థాంక్సండీ" అందావిడ. "వెల్‌కమ్" అని ఫోన్ పెట్టేశాడు అంబుజోదరం.

శ్రీవిద్య మొగుడు వనమాలి, అంబుజోదరం ఇంచుమించు ఒకేసారి జాయినయ్యారు ప్రభుత్వోద్యోగంలో ముప్పైఅయిదేళ్ల సర్వీసు పూర్తి చేసి ఇద్దరూ రిటైరయ్యారు. కాకపోతే వేర్వేరు స్థలాల్లో. అంబుజోదరం ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లో ఎక్కువకాలం పనిచేయడం వల్ల అతను ఎవరి పించన్ ఫారాలు నింపినా అవి ఎటువంటి ఆడిట్ అబ్జక్షన్స్ లేకుండా, ట్రెజరీలో ఆమోదముద్ర పడుతుంది, సైగా ఎవరిదగ్గరా

ఎటువంటి పారితోషికమూ పుచ్చుకోకుండా, తన డిపార్ట్‌మెంట్ పింఛన్‌దార్లకి పింఛన్ ఫారాలు నింపి సహకరిస్తుంటాడు. కాని వారి వారసులైన వితంతువులకి పింఛన్ ఫారాలు తానెప్పుడూ నింపలేదు. నింపవలసి రావడం, ఇదే ప్రథమం.

ఈ టెలిఫోన్ సంభాషణలు విన్న అంబుజోదరం అర్ధాంగి దుర్గ "ఎవరితోనండి ఫోన్‌లో మాట్లాడేరు?" అనడిగింది.

"రెణ్నెల్ల క్రితం చనిపోయిన మా కొలీగ్ వనమాలిగారి భార్య శ్రీవిద్య" అన్నాడు అంబుజోదరం.

"ఏమిటీ విశేషం?"

"అతని తరువాత ఆవిడక్కూడా పింఛన్ వస్తుంది కదా! ఆ పింఛన్ ఫారాలు కాస్త నింపి పెట్టమని కోరింది."

"మీరొప్పుకున్నారా?"

"ఉపకారమే కదా, తప్పుతుందా?"

"ఎందుకు తప్పదు? తప్పుతుంది. తప్పితీరుతుంది!" అంది దుర్గ గొంతు హెచ్చించి. అంబుజోదరం అవాక్కై పోయాడు.

"మంచీచెడ్డా లేకుండా ఆ తలచెడ్డదాన్ని ఇంటికి రప్పిస్తారా? దరిద్రదేవత తాండవిస్తుంది ఈ ఇంట్లో. ఆవిడ గుమ్మంలో అడుగుపెట్టిందంటే కాళ్లు విరగ్గొడతాను!" చిందులు తొక్కింది దుర్గ.

అంబుజోదరానికి పరోపకారం చెయ్యడమే తప్ప ఈ సెంటిమెంట్స్ తెలియవు. లోలోపల చాలా మథనపడ్డాడు. 'ఆడదానికి ఆడదే శత్రువు' అనే కొన్నివందల ఉదాహరణలలో ఇదొకటి. అంబుజోదరం డైలమాలో పడిపోయాడు. ఇంట్లో దుర్గతో నిరంతరం ఘర్షణలకు దిగుతూ గడపడమా? లేక సఖ్యతతో సుఖశాంతులతో గడపడమా? ఇప్పటికే సీనియర్ సిటిజెన్ అయిపోయాడు. దుర్గ పెట్టే ఆరళ్ళతో ఇంకెన్నేళ్లు గడపాలి? తను సుఖశాంతులతోనే శేషజీవితం గడపాలని నిశ్చయించుకున్నాడు. వెంటనే ఫోనెత్తి శ్రీవిద్యకి చెప్పాడు. "సోదరీ! మీరు అన్యథా భావించకండి. మీ పింఛన్ కాగితాలు ఇంకెవరిచేతనైనా రాయించుకోండి. నాకు మరో అర్జంట్ పని తగిలింది."

భీకరంగా అవతరించిన 'దుర్గ', తన క్రోధాన్ని ఉపసంహరించుకుని సౌమ్య అయిన 'ఉమ'గా మారిపోయింది!

కానీ.... శ్రీవిద్య విషయంలో ఆ తల చెడ్డదాన్ని ఇంటికి రప్పిస్తారా?' అని భర్తతో పోరాడిన దుర్గకే 'దుర్గ'తి పడుతుందని తెలియులేదు. అనతికాలంలో తనే తలచెడ్డదవుతుందని... 'లలాటలేఖానపునః ప్రయాతి'!

13 జూలై 2002
**ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక**